క్లుప్తంగా

ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



నిమ్మకాయల అలంకరణలో కనకదుర్గమ్మ

జామి: శ్రావణమాసం ప్రారంభం సందర్భంగా స్థానిక పెట్రోల్ బంకు సమీపంలోని కనకదుర్గమ్మ ఆలయంలోఅమ్మవారిని నిమ్మకాయలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు భగవాన్ శర్మ భక్తులతో కుంకుమ పూజలు చేయించారు.

నేడు ప్రభుత్వ భవనాల ప్రారంభం



ప్రారంభానికి సిద్ధమైన భవనాల సముదాయం

కొత్తవలస: మండలంలోని రెల్లి గ్రామంలో సచివాలయం, రైతుభరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ విలేజ్ క్లినిక్‌ల నూతన భవనాలను ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాస రావు శుక్రవారం ప్రారంభించనున్నారని పంచాయతీ రాజ్ డీఈ సీహెచ్.స్వామినాయుడు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామంలో ఒకే ప్రాంగణంలో సుమా రు కోటి రూపాయలతో భవనాలను నిర్మించారు. ప్రభుత్వ కార్యాలయాలకు నూతన భవనాలు అందుబాటులోకి వస్తుండడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సేవలతోనే గుర్తింపు



ఉపాధ్యాయిని భారతిని సన్మానిస్తున్న గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు

చీపురుపల్లిరూరల్: నిబద్ధతతో సేవలందించే ప్రతి ఉద్యోగికి సమాజంలో ప్రత్యేక గుర్తింపు ఉంటుందని రావివలస సర్పంచ్ పనస మణికంఠ, ఎంపీటీసీ కొమ్ము పద్మ,పెదనడిపల్లి హైస్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ రెహానాబేగం అన్నారు. రావివలస ప్రాథమిక పాఠశాల నుంచి పుర్రేయవలసకు బదిలీ అయిన ఉపాధ్యాయిని ఎం.వి.భారతి ఆత్మీయ వీడ్కోలు సన్మాన కార్యక్రమం రావివలస పాఠశాలలో గురువారం నిర్వహించారు. హెచ్ఎం పి.రమేష్, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు వలిరెడ్డి రవీంద్రనాయుడు, సీఆర్టీ భాగ్యశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

ఎవెన్యూ ప్లాంటేషన్ పనుల పరిశీలన



మొక్కలు నాటేందుకు తవ్విన గుంతలను పరిశీలిస్తున్న ఏపీఓ పెద్దప్పలనాయుడు

మెరకముడిదాం: ఎవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా ఊటపల్లి, కొమ్మానివలస ప్రధానరహదారికి ఇరువైపులా మొక్కలు నాటేందుకు తవ్విన గుంతలను ఉపాధి హామీ ఏపీఓ ఎస్.పెద్దప్పలనాయుడు, జేఈ నరేంద్ర గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో భాగం రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటుతున్నామని చెప్పారు. ఈ మొక్కల సంరక్షణ బాధ్యత ఉపాధి వేతనదారులు తీసుకోవాలని సూచించారు. వారి వెంట క్షేత్రసహాయకుడు, పలువురు వేతనదారులు ఉన్నారు.

ఆర్టీసీ బస్సు, లారీ ఢీ: ముగ్గురికి గాయాలు



గాయపడిన వారిని 108 వాహనంలో తరలిస్తున్న సిబ్బంది

బొండపల్లి: మండలంలోని అంబటివలస గ్రామం సమీపంలో జాతీయ రహదారిపై గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురం నుంచి విశాఖపట్నం వెళ్తున్న ఆర్టీసీ డీలక్స్ బస్సును విశాఖపట్నం నుంచి సాలూరు వస్తున్న లారీ బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న కణపాకకు చెందిన ఆర్.రామరావుతో పాటు, నూకలపాడుకు చెందిన ఎ.లక్ష్మి, లారీ డ్రైవర్ ఎ.మురళీకృష్ణకు తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనంలో విజయనగరంలోని కేంద్ర సర్వజన ఆస్పత్రికి తరలించారు. వారి పరిస్థితి ప్రసుత్తానికి నిలకడగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రభుత్వంపై దుష్ప్రచారాన్ని తిప్పికొట్టండి

- పార్టీకోసం పనిచేసే వారికి అండగా ఉంటాం
- సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు బీమా
- ఈనెల19 నుంచి సెప్టెంబర్–5 వరకు సచివాలయాల సందర్శన
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

చీపురుపల్లి: వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేనంత అభివృద్ధి, సంక్షేమం జరిగినప్పటికీ ...వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై కొన్ని టీవీ ఛాన ళ్లు, పత్రికలు నిత్యం అబద్ధాలను, వ్యతిరేక వార్తలను ప్రజల్లోకి తీసుకు వెళుతున్నాయని, వారి దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని వైఎస్సార్‌సీపీ శ్రేణులకు ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. పట్టణంలోని రాధామాదవ ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గ స్థాయి జగనన్న సచివాలయ కన్వీనర్ల సమావేశం గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ పార్టీకీ లేని విధంగా వైఎస్సార్ సీపీకి గ్రామస్థాయిలో సచివాలయ కన్వీనర్లు,గృహసారథులతో అతిపెద్ద సైన్యం ఉందన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ కార్యకర్తలకు ఎలాంటి కష్టం వచ్చినా పార్టీ అధిష్టా నం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల కుటుంబాలకు సామాజిక భద్రత కల్పించేందుకు పార్టీ రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు బీమా సదుపాయం కల్పిస్తోందని స్పష్టం చేశారు. అభివృద్ధి, సంక్షేమానికి సమప్రాధాన్యం ఇస్తుండడంతో క్షేత్రస్థాయిలో ప్రజల నుంచి ప్రభుత్వానికి చక్కని మద్దతు లభిస్తోందని అన్నారు. అయితే కొన్ని మీడియా ఛానెళ్లు దాన్ని తొక్కిపెట్టి దుష్ప్రచారాలు చేస్తున్నాయని మండిపడ్డారు.

శంకుస్థాపనలు తప్ప చంద్రబాబు చేసిందేమీ లేదు

టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో శంకుస్థాపనలు చేయడం, ప్రజలను మోసం చేయడం తప్ప ఏ అభివృద్ధి పనిని పూర్తి చేసి ప్రారంభించింది లేదని జెడ్పీ చైర్మన్ అన్నారు. 2014 నుంచి 2019 వరకు టీడీపీ పాలనలో జిల్లాలో చేసిన అభివృద్ధి ఏంటో ఆ పార్టీ నాయకులు చెప్పగల రా అని ప్రశ్నించారు. 2019లో ఎన్నికలకు పదిరోజుల ముందు జిల్లా మెడికల్ కళాశాలకు, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి చంద్రబాబు ఉత్తుత్తి శంకుస్థాపనలు చేసి ప్రజలను మోసం చేశారని గుర్తు చేశారు. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోనికి వచ్చిన వెంటనే సీఎం జగన్ మెడికల్ కళాశాలకు శంకు స్థాపన చేయడంతో పాటు భూములు కేటాయించారని చెప్పారు. భవన నిర్మాణాలు నిర్మాణ పూర్తవుతున్నాయని, మరో నెల రోజుల్లో మెడికల కళాశాల ప్రారంభించనున్నట్లు స్పష్టం చేశారు. ఇప్పటికే కళాశాలలో ఎంబీబీఎస్ అడ్మిషన్లు ప్రక్రియ ప్రారంభమైందని తెలిపారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణానికి రైతులను ఒప్పించి భూములను సిద్ధం చేసి, కొద్దిరోజుల క్రితమే సీఎం జగన్ శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. మరో మూడు నెలల్లో భోగాపురం విమానాశ్రయం అందుబాటులోనికి రానుందని చెప్పారు.

కేంద్రమంత్రిగా జిల్లాకు ఏమి చేశారు

కేంద్రమంత్రిగా పని చేసిన జిల్లాకు చెందిన టీడీపీ నాయకుడు అశోక్‌గజపతిరాజు ఈ జిల్లా అభివృద్ధికి ఏమి చేశారో చెప్పాలని జెడ్పీ చైర్మన్ ప్రశ్నించారు. ఎన్నిక లు దగ్గరపడుతుండటంతో మళ్లీ రోడ్లెక్కి అధికారం కోసం ఆరాటంపడుతున్నారని అన్నారు. చీపురుపల్లి నియోజకవర్గ టీడీపీ నాయకులు గ్రామాల్లో ఇంటింటికి వెళితే అభివృద్ధి ఎవరు చేశారో తెలుస్తుందన్నారు. మీడియా ఛానెల్స్ ఉన్నాయని నాలుగు ప్రెస్మీట్‌లు పెట్టడం రాజకీయం కాదన్నారు. స్థాయి తెలుసుకుని విమర్శలు చేయడం నేర్చుకోవాలని హితవు పలికారు. టీడీపీ నేతులు ప్రజలకు మాయమాటలు చెప్పి మోసం చేసేందుకు వస్తున్నారని, అప్రమత్తం గా ఉండాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ఈనెల19 నుంచి సెప్టెంబర్–5 వరకు ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సచివాలయ కన్వీనర్లు సచివాలయాల సందర్శన చేయాలని చెప్పారు. కార్యక్రమంలో నియోజకవర్గ వైఎస్సార్ సీపీ పరిశీలకుడు నిమ్మాన దాసు, చీపురుపల్లి,గరివిడి,గుర్ల ఎంపీపీలు ఇప్పిలి వెంకటనరసమ్మ, మీసాల విజయలక్ష్మి, పాట్నూరి ప్రమీల, జెడ్పీటీసీలు వలిరెడ్డి శిరీష, వాకాడ శ్రీనివాసరావు, సీర అప్పలనాయుడు, సచివాలయ మండల కన్వీనర్లు సువ్వాడ అప్పలనాయుడు,పొన్నాడ కుమార్, పి.ఎస్.ఆర్.కె.ప్రసాద్, బెల్లాన బంగారునాయుడు, నాయకులు ఎస్.వి.రమణ రాజు,ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసులనాయుడు, బెల్లాన వంశీకృష్ణ, మీసాల విశ్వేశ్వరరావు, కొణిశ కృష్ణంనాయుడు, కోట్ల వెంకటరావు, తాడ్డి వేణు, పాట్నూరు సన్యాసప్పలనాయుడు పాల్గొన్నారు.



హాజరైన నాలుగు మండలాల సచివాలయాల కన్వీనర్లు

అభివృద్ధి, సంక్షేమాన్ని వివరిద్దాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అప్పలనరయ్య

- సచివాలయ కన్వీనర్ల సమావేశంలో ఎమ్మెల్యే అప్పలనరసయ్య



సమావేశానికి హాజరైన సచివాలయ కన్వీనర్లు

బొండపల్లి: వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేసిన సంక్షేమ పథకాలను, చేపట్టిన అభివృద్ధిని గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని... ప్రతిపక్ష పార్టీలు, ఎల్లో మీడియా దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని వైఎస్సార్‌సీపీ సచివాలయ కన్వీనర్లకు గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య సూచించారు. మండలంలోని గొట్లాం గ్రామంలోని సత్య ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గస్థాయి వైఎస్సార్‌సీపీ సచివాలయాల కన్వీన ర్ల సమావేశాన్ని ఎమ్మెల్సీ పి.సూర్యనారాయణరాజు(సురేష్‌బాబు)తో కలిసి గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయ కన్వీనర్లతో పాటు ,గృహసారథులకు పార్టీ బీమా సౌకర్యం కల్పిస్తోందని తెలిపారు. ఈనెల 18 నుంచి వచ్చే నెల13వ తేదీలోగా బీమా నమోదు కార్యక్రమాన్ని పూర్తి చేయాలని చెప్పారు. దేశంలో ఏరాష్ట్రంలో లేనన్ని సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నా రని, అలాగే జిల్లాలో మెడికల్ కళాశాల, విమానాశ్రయం ఏర్పాటుతో పాటు చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలని కోరారు. ప్రభుత్వంపై ఎల్లో మీడియా నిత్యం చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని, బురదజల్లే కథనాలను ఎక్కడికక్కడ ఖండించాలని సూచించారు. పార్టీ కోసం పని చేసే వారికి అధిష్టానం తగిన గుర్తింపు ఇస్తుందన్నారు. ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలునాయుడు, పార్టీ జిల్లా నాయకుడు ఎం.నారాయణమూర్తిరాజు, బొండపల్లి, దత్తిరాజేరు ఎంపీపీలు చల్లా చలంనాయుడు, జి.సింహాద్రప్పలనాయుడు, బొండపల్లి, గజపతినగరం, దత్తిరాజేరు, గంట్యాడ, జామి జెడ్పీటీసీలు రాపాక సూర్యప్రకాశరావు, గార తవుడు, వర్రి నర్సింహమూర్తి, గొర్లె సరయు, బొండపల్లి, గజపతినగరం, దత్తిరాజేరు,జామి మండలాల పార్టీ కన్వీనర్లు ఈదుబిల్లి కృష్ణ, బూడి వెంకటరావు, కడుబండి రమేష్ నాయుడు, గొర్లె రవికుమార్, జేసీఎస్ కన్వీనర్లు పల్లి రఘు, కనకల సుబ్రహ్మణ్యం , మహదేవ ఫణీంద్రుడు, ఆర్.రామసూర్యం, సిరెడ్డి చంద్రినాయుడు, నాయకులు మహంతి రమణ,మీసాల తులసీరాం తదితరులు పాల్గొన్నారు.

సుబ్బారెడ్డికి ఘన స్వాగతం



నాయకులతో సమావేశమైన వై.వి.సుబ్బారెడ్డి

శృంగవరపుకోట: నియోజకవర్గ సచివాలయ కన్వీనర్ల సమావేశానికి విచ్చేసిన వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి వై.వి.సుబ్బారెడ్డికి ఆ పార్టీ నాయకులు, శ్రేణులు గురువారం ఘనస్వాగతం పలికారు. ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు బొడ్డవర గ్రామంలోని తన నివాసానికి సుబ్బారెడ్డి, పార్టీ పెద్దలను అల్పాహారానికి ఆహ్వానించారు. బొడ్డవర వచ్చిన సుబ్బారెడ్డికి ఎమ్మెల్సీ రఘురాజు దంపతులు, ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, రాష్ట్ర వెలమకార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి, రాష్ట్ర కార్యదర్శి రొంగలి జగన్నాథం, డీసీసీబీ చైర్మన్ వేచలపు చినరామునాయుడు, అయిదు మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పలుకార్పొరేషన్‌ల డైరెక్టర్లు, పార్టీ మండల అధ్యక్షులు, నాయకులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం సుబ్బారెడ్డి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, నాయకులు అల్పాహార విందులో పాల్గొన్నారు. రఘురాజు దంపతులు సుబ్బారెడ్డిని సన్మానించారు.

ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయం

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కడుబండి



మహిళకు పథకాల బుక్ లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

లక్కవరపుకోట: క్షేత్రస్థాయిలో ప్రజాసమస్యలను తెలుసుకొని, వాటిని పరిష్కరించడమే ధ్యేయంగా గడప గడపకూ వస్తున్నామని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని కళ్లేపల్లి గ్రామంలో గురువారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించా రు. జోరువానలోనూ ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పథకాల ద్వారా ప్రతీ కుటుంబానికి కలిగిని లబ్ధిని వివరించారు.గ్రామస్తులు చెప్పిన సమస్యలను నమోదు చేసుకుని,వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎస్.కోట నియోజకవర్గంలో ' గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నేటికి 245 రోజులు పూర్తయిందని తెలిపారు. 76 సచివాలయాల పరిధిలోని 67 వేల కుటుంబాలను నేరుగా కలిసి, వారి సమస్యలు తెలుసుకున్నా మని, 70 శాతానికి పైగా సమస్యలను పరిష్కరించామన్నారు. సర్పంచ్ గోకేడ ముసలినాయుడు, పార్టీ నాయకులు నక్క కృష్ణ, తూర్పాటి అప్పలరాజు, కాటమయ్య, జెక్కాన సింహాద్రప్పడు తదితరులు పాల్గొన్నారు.

యోగాపై అవగాహన నేడు

బొండపల్లి: గొట్లాం గ్రామంలోని సత్య ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు యోగా, ధ్యానంపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు పిరమిడ్ సేవాదళ్ జిల్లా కన్వీనర్ వి.రామకృష్ణ రాజు గురువారం తెలిపారు. ముఖ్య అతిథిగా యోగా గురువు సదానందగిరి మహరాజ్ హాజరు కానున్నారని చెప్పారు. యోగా అభ్యాసకులతో పాటు, పిరమిడ్ సేవాదళ్ సభ్యులు హాజరు కావాలని కోరారు.

అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీలు



రికార్డులను పరిశీలిస్తున్న పీడీ శాంతకుమారి

గజపతినగరం: పురిటిపెంట గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం–3లో ఐసీడీఎస్ పీడీ బి.శాంతకుమారి గురువారం తనిఖీలు చేశారు. టేక్ హోం రేషన్ సక్రమంగా అందిస్తున్నారా లేదా అని గర్భిణులు, బాలింతలను ఆమె ఆరా తీశారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. ప్రీస్కూల్ పిల్లల విద్యాసామర్థ్యాన్ని పరీక్షించారు. ఆమె వెంట ఐసీడీఎస్ పీఓ పి.నాగమణి, అంగన్‌వాడీ కార్యకర్త సూర్యకుమారి తదితరులు ఉన్నారు.

లక్ష్యసాధనకు నిరంతరం కృషి చేయాలి



రచయిత విశ్వనాథంను సత్కరిస్తున్న యువత, ఆశయ రమణ

చీపురుపల్లి: యువత ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటి సాధనకు నిరంతరం కృషి చేయాలని పట్టణానికి చెందిన రచయిత శుభం విశ్వనాధం అన్నారు. స్థానిక జి.వి.ఆర్ కళాశాల మైదానంలో ఆశయయూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయన్ని గురువారం సత్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రచయిత కావాలనే లక్ష్యంతో చిన్నప్పటి నుంచి పుస్తకాలు చదవడం, కవితలు రాయడం అలవాటు చేసుకున్నానని చెప్పారు.13 సినిమాల్లో మంచి సందేశంతో కూడిన పాటలు రాశానన్నారు. ఈనెల 18న విడుదల కానున్న మిస్టర్ ప్రెగ్నెంట్ సినిమాలో మూడు పాటలు రాసే అవకాశం వచ్చిందని తెలిపారు. ఆశయసంస్థ అధ్యక్షుడు రెడ్డి రమణ, సూరు చిలకయ్య,బి.నవీన్,రాంబాబు పాల్గొన్నారు.

'ఫ్యామిలీ డాక్టర్' తో ఇంటి వద్దే మెరుగైన వైద్యం



వైద్య శిబిరంలో సేవలను పరిశీలిస్తున్న ఎంపీపీ హైమావతి

గంట్యాడ: 'ఫ్యామిలీ డాక్టర్' సేవలను ప్రజలు వినియోగించుకోవాలని ఎంపీపీ పీరుబండి హైమావతి సూ చించారు. మండలంలోని రామవరం గ్రామంలో గంట్యాడ పీహెచ్‌సీ వైద్యాధికారి వెంకటేష్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. వైద్యసిబ్బంది శిబిరం ఏర్పాటు చేసి ప్రజలకు వివిధ వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం గృహసందర్శన చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రజలకు ఇంటివద్దే మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని అన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మద్దతుదారును గెలిపించండి

- సర్పంచ్ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే అప్పలనరసయ్య



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

గంట్యాడ: పెంటశ్రీరాంపురం సర్పంచ్ స్థానానికి నిర్వహిస్తున్న ఉప ఎన్నికలో వైఎస్సార్‌సీపీ మద్దతుతో పోటీ చేస్తున్న కరక గౌతమిని అధిక మెజార్టీతో గెలిపించా లని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ప్రజలను కోరారు. పెంటశ్రీరాంపురం గ్రామంలో బుధ వారం రాత్రి నిర్వహించిన సభలో ఆయన మాట్లాడు తూ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కృషి చేస్తోందని చెప్పారు. పార్టీలు, కులాలు, మతాలకతీతంగా పథకాలు అంది స్తున్నామని, ప్రతి నెలా ఒకటో తేదీ ఉదయాన్నే వలంటీర్లు తలుపుతట్టి అవ్వాతాతలకు, దివ్యాంగులకు, వితంతువులకు పింఛన్లు అందిస్తున్నారని తెలిపారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సేవలన్నీ గ్రామాల్లోనే అందిస్తున్నామని, ఓటు అడిగే హక్కు వైఎస్సార్‌సీపీకి మాత్రమే ఉందన్నారు. టీడీపీ ప్రజలకు చేసింది ఏమీ లేదని, ఆ పార్టీ నాయకుల మోసపూరిత మాటలు నమ్మవద్దని ప్రజలకు సూచించారు. జెడ్పీటీసీ వర్రి నరసింహామూర్తి, జిల్లా వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, సర్పంచ్ అభ్యర్థి కరక గౌతమి, ఎంపీటీసీ సిరపురపు శ్యామల, ఉప సర్పంచ్ కరక మహేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు నారాయణమూర్తిరాజు, పి.నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

నివాళి



చిన అప్పయ్యమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

గంట్యాడ: మాజీ ఎంపీ కొండపల్లి పైడితల్లినాయుడు భార్య చినఅప్పయ్యమ్మ పెద్ద కర్మను మండల కేంద్రంలో గురువారం నిర్వహించారు. ఆమె చిత్రపటానికి గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. జెడ్పీటీసీ వర్రి నరసింహమూర్తి, వైఎస్సార్ సీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్ , ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, మాజీ ఎమ్మెల్యే కె.ఏ.నాయుడు, వైఎస్సార్ సీపీ నాయకులు కొండపల్లి కొండలరావు, నారాయణమూర్తిరాజు, లచ్చిరెడ్డి కృష్ణ, రంధి రాము పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

గజపతినగరం: గజపతినగరం, మెంటాడ సబ్‌స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ కృష్ణమూర్తి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా మండల కేంద్రాలతో పాటు ఆ సబ్ స్టేషన్ పరిధి గ్రామాలకు సరఫరా ఉండదని స్పష్టం చేశారు. అలాగే గజపతినగరం మండలం జిన్నాం రూరల్ ఫీడర్ పరిధిలో మరమ్మతులు చేయనున్నందున ఉదయం 8 గంట ల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

వేపాడ సబ్‌స్టేషన్ పరిధిలో...

వేపాడ: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ తీగలపై చెట్ల కొమ్మలు తొలగింపు, మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ సూరిబాబు గురువారం తెలిపారు. వావిలపాడు, నల్లబిల్లి, చినగుడిపాల, నీలకంఠరాజపురం, దబ్బిరాజుపేట, వేపాడ, వల్లంపూడి, వీలుపర్తి, చామలాపల్లి, కరకవలస తదితర గ్రామాలకు సరఫరా ఉండదని, వినియోగదారులు గుర్తించి సహకరించాలని కోరారు.

గ్రీన్ అంబాసిడర్ల నిరసన

శృంగవరపుకోట/లక్కవరపుకోట: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో గ్రీన్ అంబాసిడర్లు గురువారం ఎస్.కోటలో ర్యాలీ చేశారు. అలాగే లక్కవరపుకోట ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఎస్.కోటలో సీఐటీయూ కార్యదర్శి మద్దిల రమణ మాట్లాడుతూ గ్రీన్ అంబాసిడర్లకు వేతన బకాయిలు చెల్లించాలని, కనీస వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. అలాగే విధి నిర్వహణలో మృతిచెందిన కార్మికులకు రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

రహదారి భద్రత అందరి బాధ్యత

దత్తిరాజేరు: రహదారి భద్రత అందరి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని షికారుగంజి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ప్రసన్నలక్ష్మి అన్నారు. పాఠశా లలో విద్యార్థులకు రహదారి భద్రతా నియమాలపై గురువారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ అతివేగం, నిర్లక్ష్యం వల్లే చాలా రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయని అన్నారు. ప్రమాదాల్లో యువతే ఎక్కువగా మృతి చెందుతున్నారని చెప్పారు. విద్యార్థులు గ్రామాల్లో ప్రజలకు, తల్లిదండ్రులకు రహదారి భద్రతా నియమాలపై అవగాహన కల్పించాలని సూచించారు. లైసెన్స్ లేనివారు, మైనర్లు వాహనాలు నడపకూడదన్నారు. అనంతరం సంబంధిత గోడపత్రికలను ఆవిష్కరించారు.

మద్యం బాటిళ్లు ధ్వంసం

గజపతినగరం: గజపతినగరం సర్కిల్ పరిధిలో గతంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వారి నుంచి స్వాధీనం చేసుకున్న సుమారు 500 మద్యం బాటిళ్లను స్థానిక సర్కిల్ కార్యాలయం ఆవరణలో సీఐ ఎల్.అప్పలనాయుడు ఆధ్వర్యంలో గురువారం ధ్వంసం చేశారు. అక్రమంగా మద్యం విక్రయించిన వారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. అలాగే గజపతినగరం సర్కిల్ పరిధిలో వివిధ కేసుల్లో సీజ్ చేసిన 15 ద్విచక్రవాహనాలకు వేలం వేశారు. ఎక్సైజ్ ఎడిషినల్ ఎస్పీ శైలజారాణి, తదితరులు పాల్గొన్నారు.

కలుషిత నీటితో విద్యార్థులకు అస్వస్థత



ఎస్.కోట ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలికలు

శృంగవరపుకోట: కళాశాల యాజమాన్యంపై కోపంతో తాగునీటిలో చీమలమందు కలిపి తోటి విద్యార్థుల అస్వస్థతకు అదే కళాశాల విద్యార్థులు కారణమయ్యారు. ఘటనకు సంబంధించి పుణ్యగిరి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థినులు కృష్ణవేణి, శైలజ, రమ్య, సాయిలక్ష్మిలు బుధవారం సాయంత్రం స్టడీఅవర్‌లో ఫ్రీజర్‌లో నీళ్లు తాగారు. కొద్ది సమయం తర్వాత వాళ్లు కడుపునొప్పి అంటూ పడిపోయారు. నీళ్లు వాసన వచ్చాయని వార్డెన్‌కు చెప్పడంతో ఆమె యాజమాన్యానికి సమాచారం ఇచ్చారు. బాలికలను హుటాహుటిన ఎస్.కోట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చీమలమందు కలిసిన నీరు తాగడం వల్లే కడుపునొప్పి, వాంతులు అయినట్టు వైద్యులు నిర్ధారించారు. విద్యార్థినులు కోలుకునేలా వైద్యసేవలు అందించారు. ఫ్రీజర్ వద్ద ముగ్గురు విద్యార్థులు ఉన్నారని, వాళ్లే ఉద్దేశపూర్వకంగా ఫ్రీజర్‌పై క్యాప్ విప్పి చీమల మందు ప్యాకెట్ నీటిలో వేశారని కొందరు విద్యార్థులు చెప్పడంతో పుణ్యగిరి విద్యాసంస్థల కరస్పాండెంట్ ఎల్.సత్యనారాయణ ఎస్.కోట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పోరలి, బూడిపేటలో 'ఫ్యామిలీ డాక్టర్'

దత్తిరాజేరు/ గజపతినగరం: దత్తిరాజేరు మండలంలోని పోరలి, గజపతినగరం మండలంలోని బూడిపేట గ్రామంలో వైద్యాధికారులు సతీష్ కుమార్, లోకప్రియ ఆధ్వర్యంలో గురువారం 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమాలు నిర్వహించారు. పోరలిలో ఏర్పాటు చేసిన శిబిరంలో 56 మందికి, బూడిపేటలో 74 మందికి వైద్య సిబ్బంది వివిధ వైద్యపరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు.